
త్వరలో నైట్‌బజార్

ఐటీ ఉద్యోగులు, నగరవాసులకు షాపింగ్ అందుబాటులో..

శిల్పారామం ఇందిరా మహిళాశక్తి బజార్‌కు మరమ్మతులు | **106 స్టాల్స్, 17 రకాల వ్యాపారాలు**



తెలంగాణ పిండివంటల స్టాల్..

షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రత్యేకంగా తెలంగాణ పిండి వంటల స్టాల్‌ను ఏర్పాటు చేయనున్నారు. వెదురు, గ్లాస్, మట్టితో తయారు చేసిన ఉత్పత్తులు, జ్యూట్ బ్యాగ్స్, గాజులు, గృహాలంకరణ ఉత్పత్తులు లభిస్తాయి. కాగా పక్కనే ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం వద్ద సందర్శకులను ఆకట్టుకునేలా వాటర్ ఫౌంటేన్‌ను ఏర్పాటు చేశారు.





మాదాపూర్: శిల్పారామం వద్ద ఇందిరా మహిళాశక్తి బజార్ త్వరలో అందుబాటులోకి రానుంది. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ..అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ చేసుకునేందుకు శిల్పారామంలో ఉన్న 106 షాప్‌లకు మరమ్మతులు చేస్తున్నారు. ఇది అందుబాటులోకి వస్తే ఐటీ ఉద్యోగులు రాత్రి 2గంటల వరకు షాపింగ్ చేసుకోవచ్చు. ఈ వ్యాపారాలు సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ మరమ్మతుల కోసం ఇప్పటికే రూ. 7కోట్ల రూపాయలు విడుదలయ్యాయని అధికారులు తెలిపారు. స్టాల్స్ కేటాయించినప్పటికి వసతులు లేకపోవడంతో నైట్‌బజార్ ఆగిపోయింది.



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఇందిరా మహిళాశక్తి బజార్‌లో అందుబాటులో ఉంచనున్నారు. ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు, పరిసర ప్రాంతాలలో పచ్చదనం పెంపునకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే సాయంత్రం సమయాలలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు స్టేజ్‌ను సిద్ధం చేశారు. మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి ప్రత్యేక హాల్‌ను సైతం ఏర్పాటు చేశారు.





శేరిలింగంపల్లిని అభివృద్ధిలో ముందుంచుతాం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



గచ్చిబౌలి డివిజన్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు

గచ్చిబౌలి/శేరిలింగంపల్లి/రాయదుర్గం: కాలనీలు, బస్తీలలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి సర్కిల్‌లో కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లిలో రూ.3.12 కోట్లతో చేపట్టే సీసీరోడ్ల నిర్మాణానికి కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, హమీద్‌పటేల్, గంగాధర్‌రెడ్డితో కలిసి ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాజాగా మూడు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి ,అలాగే శేరిలింగంపల్లి, కొండాపూర్, గచ్చిబౌలి డివిజన్లలోని కాలనీలు ,బస్తీలలో రూ.3.12 కోట్లతో సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కాలనీలవాసులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తయ్యేలా కృషి



హరిజన్ బస్తీలో పర్యటించిన జగదీశ్వర్‌గౌడ్ తదితరులు

మాదాపూర్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని హరిజన్ బస్తీలో నెలకొన్న సమస్యలపై కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ వి.జగదీశ్వర్‌గౌడ్ శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. బస్తీలో సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ, బస్తీలలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తానన్నారు.కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు నాగేశ్‌నాయక్, నాయకులు రాజు, కృష్ణ, గోపాల్ నాయక్, శ్రీనివాస్, సందయ్య, గణేశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.1100 కోట్లతో 7 సీవరేజ్ ప్లాంట్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమృత్ 2.0 పథకంలో భాగంగా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని ఏడు చెరువుల పరిధిలో 1100 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 7 సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేయబోతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పటాన్‌చెరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జలమండలి ఎస్టీపీ విభాగం అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.నియోజకవర్గ పరిధిలోని తిమ్మక్క చెరువు, మేళ్ల చెరువు, ఉసికే బావి, ఇక్రిశాట్, గండిగూడెం, బచ్చుగూడెం, అమీన్‌పూర్ పరిధిలోని చెరువుల సమీపంలో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఏర్పాటవుతున్నాయన్నారు. అందుకు అనుగుణంగా భూకేటాయింపులు జరపాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్, స్థానిక రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. ప్రథమ ప్రాధాన్యతగా గుర్తించి వెంటనే భూములు కేటాయించాలని తహసీల్దారులను ఆదేశించారు.ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజా, జలమండలి డీజీఎంలు బాబు, దీపాలి, శ్రీనివాసరావు, తహసీల్దార్లు రంగారావు, రాధా, సంగ్రామ్, భిక్షపతి, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిన్నారం, గుమ్మడిదల, పటాన్‌చెరు, రామచంద్రాపురం మండలాల పరిధిలోని 208 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన రెండు కోట్ల ఎనిమిది లక్షల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు, ఆయా మండలాల తహసీల్దార్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, సోమిరెడ్డి, పరమేశ్ యాదవ్ పాల్గొన్నారు.

నేడు దత్త జయంతి

రాయదుర్గం: దత్త జయంతిని పురస్కరించుకొని టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ నిర్వాహక ప్రతినిధి డి రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆలయంలో ఉదయం 6 గంటలకు కాకడ హారతితో ఉత్సవాలను ప్రారంభిస్తామన్నారు. అనంతరం గణపతి, దత్తాత్రేయస్వామి, షిర్డీ సాయిబాబాకు అభిషేకం, అనంతరం అనఘాదేవి వ్రతం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 1 గంటకు అన్నసమారాధన, సాయంత్రం 4.30 గంటలకు పల్లకిసేవ, రాత్రి 7 గంటలకు భజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

సన్మానం



చందానగర్: తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి కొండ విజయ్‌కుమార్‌ను శుక్రవారం చందానగర్ పీజేఆర్ స్టేడియం క్రీడాకారులు, శిక్షకులు సన్మానించారు. కార్యక్రమంలో శిక్షకులు లక్ష్మణ్, మహేష్, నవీన్, శ్రీకాంత్, వెంకటేష్, ప్రభాకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యుత్ టోల్ ఫ్రీ 1912 వాహనం ప్రారంభం

పటాన్‌చెరు టౌన్: విద్యుత్ సమస్యలపై రాతపూర్వకంగా ఇస్తే సమస్యలు వెంటనే పరిష్కారం అవుతాయని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ నాగేశ్వరరావు అన్నారు. పటాన్‌చెరు విద్యుత్ డీఈఈ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారులు.. సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎప్పటి నుంచో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ వేదిక ద్వారా అవకాశం కల్పించామని తెలిపారు. అనంతరం విద్యుత్ టోల్ ఫ్రీ 1912 వాహనాన్ని అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ సభ్యులు రామాంజనేయ నాయక్, డీఈఈ భాస్కర్‌రావు , ఏడీఈలు సంజీవ, దుర్గాప్రసాద్, నాగరాజు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కమిటీ హాల్ నిర్మాణ పనుల పరిశీలన

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని మహాత్మా గాంధీ నగర్‌లో రూ.50 లక్షల నిధులతో నిర్మిస్తున్న కమిటీ హాల్ నిర్మాణ పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్, పోశెట్టిగౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ తదితరులు

ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ పరిశోధనల్లో

భారత్ అగ్రగామి



ఎన్ఐఏబీ డైరెక్టర్ డాక్టర్ తరూ శర్మ

సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

రాయదుర్గం: ఫార్మాస్యూటికల్ తయారీ, బయోటెక్నాలజీ పరిశోధనల్లో ప్రపంచంలోనే భారతదేశం అగ్రగామిగా ఎదుగుతోందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ(ఎన్ఐఏబీ) డైరెక్టర్ డాక్టర్ తరూశర్మ పేర్కొన్నారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ విభాగంలో 'ప్రీ క్లినికల్ టాక్సికాలజీ అండ్ రిస్క్ అసెస్‌మెంట్' అనే అంశంపై శుక్రవారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్ (ఎఫ్ఏబీఏ),ఎస్పైర్ సంయుక్త ఆధ్వర్యంలో కోర్సు డైరెక్టర్ డాక్టర్ కెఎస్‌రావు పర్యవేక్షణలో 5 రోజుల ఇంటెన్సివ్ కోర్సుపై ప్రత్యేక సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన టాక్సికాలజిస్టులకు మంచి డిమాండ్ ఉందన్నారు. నేషనల్ యానిమల్ రిసోర్స్ ఫెసిలిటీ ఫర్ బయోమెడికల్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ముఖేష్‌కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఆయా ఇన్‌స్టిట్యూట్ల ప్రతినిధులు, 200 మంది వరకు నిపుణులు, పలువురు టాక్సికాలజీ, ఫార్మా, బయోటెక్నాలజీ నిష్ణాతులు, ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, పరిశోధక, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

నీలం రాజశేఖర్‌రెడ్డికి ఘన నివాళి



రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు, ఫౌండేషన్ సభ్యులు, వృద్ధులు

చందానగర్: స్వాతంత్ర సమరయోధులు నీలం రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్‌లో ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. నీలం సంజీవరెడ్డి సోదరుడైన రాజశేఖర్‌రెడ్డి కమ్యూనిస్టు పార్టీ సమున్నతికి నిర్విరామంగా కృషి చేశారన్నారు. ముఖ్యంగా పార్టీలో యువకులను, మేధావులను ప్రోత్సహించారన్నారు.అనంతరం నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో జరుగుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, సీఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్, నీలం రాజశేఖర్‌రెడ్డి రీసెర్చ్ సెంటర్ కన్వీనర్ కంభంపాటి అజయ్‌కుమార్, భారత మహిళా సమాఖ్య ఏఐటీయూసీ మాజీ కార్యదర్శి బివి. విజయలక్ష్మీ, కోశాధికారి చెన్నకేశవరావు, మహిళ సంక్షేమ కేంద్ర డైరెక్టర్ జ్యోత్స్న భట్ల కల్పన, సభ్యులు, జ్యోత్స్న లలిత, ఆశ్రమవాసులు పాల్గొన్నారు.

ఖాళీ డబుల్ ఇళ్లను స్థానికులకు కేటాయించండి

బల్దియా కమిషనర్‌కు ఎమ్మెల్యే వినతి

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లలో ఖాళీగా ఉన్న ఇళ్లను స్థానికులకు కేటాయించాలని, మూడు డివిజన్ల పరిధిలో పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌తో ఎమ్మెల్యే సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పారిశ్రామికవాడగా పేరొందిన పటాన్‌చెరు పరిధిలో నిరుపేదలు అత్యధికంగా నివసిస్తున్నారని.. సొంత ఇల్లు లేక అద్దె కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలలో నిర్మించిన 40 వేల డబుల్ ఇళ్లలో ఖాళీగా ఉన్న ఇళ్లను స్థానికులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో కొద్దిమంది లబ్ధిదారులకు మాత్రమే ఇళ్లను కేటాయించడం జరిగిందని, అర్హత కలిగిన లబ్ధిదారులు వేల సంఖ్యలో ఉన్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.భారతీనగర్, రామచంద్రాపురం, పటాన్‌చెరు డివిజన్‌ల పరిధిలో పారిశుద్ధ్య కార్మికుల కొరత మూలంగా శానిటేషన్ పూర్తి స్థాయిలో జరగడం లేదని తెలిపారు. చనిపోయిన కార్మికుల స్థానాల్లో కొత్తవారిని నియమించాలని కోరారు. రహదారులపై నిర్మించిన టాయిలెట్ల నిర్వహణ గాలికి వదిలేసారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.



బల్దియా కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

నేటి నుంచి జాతర ప్రారంభం



ముస్తాబైన దత్తాత్రేయస్వామి ఆలయం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామంలోని శ్రీ గురు దత్తాత్రేయస్వామి జాతరను 14వ తేదీ నుండి 16వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్నట్టు జాతర నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...శనివారం ఉదయం జాతర ప్రారంభోత్సవంలో భాగంగా గణపతి పూజ, దత్తాత్రేయ స్వామి అభిషేకం, దత్తాత్రేయస్వామి కల్యాణం, అన్నదాన కార్యక్రమం ఉంటుందని, రెండో రోజు ఆదివారం ఉదయం ఉత్సవమూర్తులకు సామూహిక అభిషేకం, మహాపూజ, అన్నదానం, సాయంత్రం రథోత్సవం ఉంటుందన్నారు. అదేవిధంగా చివరి రోజు దత్తాత్రేయ స్వామి అభిషేకం, చక్రతీర్థము, పల్లకీ సేవ మంగళహారతి తదితర పూజలు ఉంటాయని తెలిపారు.

నెట్ బాల్ జట్లు ఎంపిక



కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్‌లో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నెట్ బాల్ మెన్ అండ్ ఉమెన్ జట్లను సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రొఫెసర్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నల్లగొండ అశోక్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపిక చేశారు. జైపూర్‌లోని సురేష్ జ్ఞానవిహార్ యూనివర్సిటీలో జనవరి 3 నుంచి 7వ తేదీ వరకు జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో ఈ జట్లు పాల్గొంటాయని తెలిపారు. ఈ సెలక్షన్స్‌లో చీఫ్ సెలక్టర్‌గా డాక్టర్ ఎస్ సోమేశ్వర్‌కుమార్ వ్యవహరించారు. ఫిజికల్ డైరెక్టర్లు, 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 'హార్ట్ ఫుల్‌నెస్'

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం హార్ట్ ఫుల్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు మానసిక ఒత్తిడిని తొలగించుకొని చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. భవిష్యత్ ప్రణాళికలు నిర్మించుకోవాలని సూచించారు. మెడిటేషన్ ద్వారా మానసిక ఆరోగ్యాన్ని ఎలా పొందవచ్చు అనే అంశంపై సంస్థ ప్రతినిధి నాగేశ్వరరావు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో యోగా, మెడిటేషన్ చేయించారు.

ఆకట్టుకుంటున్న విజ్ఞాన ప్రదర్శన

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు సెయింట్ జోసఫ్ పాఠశాలలో జరుగుతున్న సామాజిక విజ్ఞాన ప్రదర్శనకు పటాన్‌చెరు, ఇస్నాపూర్, ఇంద్రేశం, బీరంగూడ, బీహెచ్ఈఎల్, రామచంద్రాపురం, మదీనాగూడల పాఠశాలలకు చెందిన విద్యార్థులు తరలి వచ్చారు. 251 ప్రదర్శనలు ఉన్నాయి. ముఖ్యంగా స్పేస్ రూంను తయారు చేసారు. అలాగే హర్రర్ గది, వాయనాడ్ వరదల పరిస్థితిపై పోస్టర్లు ప్రత్యేకంగా నిలిచాయి.

హాస్టళ్లకు ప్రముఖుల పేర్లను పెట్టాలని వినతి

కేపీహెచ్‌బీకాలనీ: విశ్వవిద్యాలయంలో నిర్మించే నూతన వసతి గృహాలకు సంత్ సేవాలాల్ బాలుర వసతిగృహంగా, ఝల్కారీ బాయి బాలికల వసతి గృహంగా నామకరణం చేయాలని జేఎన్‌టీయూ ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు మాట్లాడుతూ.. వసతి గృహాలను ఎస్సీ, ఎస్టీ నిధులతో నిర్మిస్తున్నందున ఆయా వసతి గృహాలకు, ఆయా దళిత, గిరిజన జాతుల్లో పుట్టి దేశానికి, సమాజానికి సేవలు చేసిన ప్రముఖుల పేర్లను పెట్టాలన్నారు. కార్యక్రమంలో శివకృష్ణ, దుర్గాప్రసాద్, ధనుంజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ సదస్సు

మాదాపూర్: మాదాపూర్‌లోని శ్రీ వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్‌చే స్పాన్సర్ చేయబడిన ఈ సదస్సులో దేశవ్యాప్తంగా ప్రముఖ నిపుణులు, పరిశోధకులు, వివిధ కళాశాలల ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఔషధాల ఆవిష్కరణలు, ఫార్మసీ రంగం అభివృద్ధి గురించి చర్చించారు. కార్యక్రమంలో సురభి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ ఎస్.వాణిదేవి, కళాశాల డైరెక్టర్ అజిత, సదస్సు నిర్వాహకులు ప్రిన్సిపల్ డాక్టర్ పి.జె.ప్రసూన సుందరి, ఉప నిర్వాహకురాలు డాక్టర్ పి.దివ్య, వక్తలు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ స్వాతి బిస్వాస్, డాక్టర్ చంద్రయ్య, డాక్టర్ సోమేశ్వర్, డాక్టర్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న వాణిదేవి, కళాశాల డైరెక్టర్ అజిత తదితరులు

భర్త వేధింపులు తట్టుకోలేక..

ఆన్‌లైన్‌లో గడ్డి మందు కొనుగోలు చేసి వివాహిత బలవన్మరణం



నాగలక్ష్మి(ఫైల్)



వివరాలు తెలుసుకుంటున్న ఏసీపీ నర్సింహారావు

మియాపూర్: మనస్పర్థలు, కుటుంబ కలహాలతో విసిగిపోయిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. మియాపూర్ సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా చత్రి మండలం చిత్తాపూర్ గ్రామానికి చెందిన మొక్కపాటి వెంకట నాగలక్ష్మి(28) వివాహం భీమవరానికి చెందిన సామినేని సతీష్‌తో 2018లో జరిగింది. వీరికి 2019లో కుమార్తె జన్మించింది. కొద్ది రోజుల తర్వాత వారు విడిపోయారు. 2023 నవంబర్‌లో కోర్టు ద్వారా విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి కుమార్తె వెంకటనాగలక్ష్మి దగ్గరే ఉంటుంది. నాగలక్ష్మి కూతురుతో కలిసి మియాపూర్‌లో ఉంటూ గచ్చిబౌలిలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాది ఆగస్టు 22న నాగలక్ష్మి ఏలూరు జిల్లా తోచిలుక గ్రామానికి చెందిన ముప్పా మణికంఠ మనోజ్‌ను రెండవ వివాహం చేసుకుంది. మనోజ్ సివిల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలం ఇద్దరూ బాగానే ఉన్నారు. ఆ తర్వాత ఇద్దరి మధ్య ఆస్తి విషయంలో గొడవలు జరిగాయి. నాగలక్ష్మి పేరుపై ఉన్న వ్యవసాయ భూమిని మనోజ్ తన పేరుపై నమోదు చేయాలని, బ్యాంక్ అకౌంట్‌కు తన ఫోన్ నంబర్‌ను యాడ్ చేయించాలని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ పాస్‌వర్డ్‌లు చెప్పాలని తరచూ వేధిస్తుండేవాడు. ఇటీవల కాలంలో రెండుసార్లు ఆమెను విపరీతంగా కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. మనస్తాపం చెందిన నాగలక్ష్మి గత నెల 28వ తేదీన ఆన్‌లైన్‌లో గడ్డిమందు ఆర్డర్ చేయగా ఈ నెల 4వ తేదీ డెలివరీ అయ్యింది. కాగా బుధవారం మనోజ్, నాగలక్ష్మిల మధ్య మళ్లీ గొడవ జరిగింది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో నాగలక్ష్మి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు నాగలక్ష్మి భర్త మనోజ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం.